సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం ၊ 17 ၊ జూన్ ၊ 2025



జగద్గురువుల ఆశీస్సులు

ప్రజలందరిపై జగద్గురువుల ఆశీస్సులు ఉండాలని ఎంపీ డీకే అరుణ అన్నారు

వివరాలు 8లో ▸



జూరాలకు జలకళ

జూరాల ప్రాజెక్టుకు ఎగువన కురిసిన వర్షాలతో మరోసారి ఇన్‌ఫ్లో పెరిగింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.3 /21.2

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుంది.

సాగుకు సాయం



రైతు భరోసా నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్న పెట్టుబడి సాయం
- తొలిరోజు జిల్లాలో 1,38,682 మంది రైతులకు రూ.75.60 కోట్లు..
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): వానాకాలం ప్రారంభ సమయానికే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది. ఇక సాగు పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన బాధ తప్పిందని సంబరపడుతున్నారు. ఆన్‌లైన్‌లో భూ వివరాలు నమోదైన రైతులందరికీ పెట్టుబడి సాయం అందనుంది. ప్రస్తుత వానాకాలం సీజన్ ప్రారంభంలోనే రైతుల ఖాతాల్లో భరోసా నిధులు జమ చేయడం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. సోమవారం రెండెకరాల లోపు ఉన్న రైతులకు డబ్బులు జమ చేసింది. ప్రతి ఏడాది వానాకాలం, యాసంగిలో ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ సాగును ప్రోత్సహిస్తోంది.

2,54,059 మందికి..

ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 2,54,059 మంది రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. ఇప్పటికే అర్హులైన రైతుల జాబితా వ్యవసాయ అధికారులకు అందింది. దీని ఆధారంగా సంబంధిత యంత్రాంగం రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ట్రెజరీ, బ్యాంకర్లకు పంపించారు. ట్రెజరీ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవ్వనున్నాయి. ఇందులో 2,54,059 మంది రైతులకు రూ.255.48 కోట్ల నిధులను విడుదల చేసిన ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు చెల్లించాల్సిందిగా సంబంధిత వివరాలను ట్రెజరీకి పంపించింది. అధికారులు రైతుల వివరాలను తనిఖీ చేసిన తర్వాత రైతు భరోసా డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

■ రైతు భరోసా డబ్బులు జమ చేయడంలో సర్కారు మొదటగా చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. తొలి రోజు రెండు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులందరి ఖాతాలో డబ్బులు జమ చేసింది. సోమవారం 1,38,682 మంది రైతుల ఖాతాల్లో రూ.75,60,92,639 నగదును జమ చేసింది. ఇదిలా ఉంటే జూన్ 5వ తేదీ నాటికి పాస్ పుస్తకాలు పొందిన ప్రతి రైతుకు రైతు భరోసా వర్తింపజేస్తామని అధికారులు తెలిపారు. జిల్లాలో రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోని రైతులు 10 వేల మంది ఉంటారని ఒక అంచనా. వీరందరూ వెంటనే దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కాగా.. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో సైతం రైతులకు పూర్తిస్థాయిలో రైతు భరోసా డబ్బులు జమ కాలేదు. మిగతా రైతులు కూడా గత సీజన్‌కు సంబంధించి తమకు రైతు భరోసా అందించాలని సర్కార్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతు భరోసా వివరాలు..
జిల్లాలో సాగు భూమి 3.55 లక్షల ఎకరాలు
మొత్తం రైతులు 2,54,059
రైతు భరోసా సాయం రూ. 255.48 కోట్లు
బ్యాంకు ఖాతాలు అనుసంధానం 2,21,386

పెట్టుబడి డబ్బులు అందాయి



ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ చేయడం చాలా ఆనందంగా ఉంది. నాకు మా గ్రామంలో వ్యవసాయ పొలం ఉంది. రైతు భరోసా డబ్బులతో సాగు పనులు ప్రారంభించి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తాను. అప్పులు చేయకుండా రైతు భరోసాతో పెట్టుబడి సాయం చేస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– జి.కుర్మయ్య, రైతు, కోడూర్, మహబూబ్‌నగర్ రూరల్

ఎంతో మేలు..



ప్రభుత్వం రైతులకు మంచి అదునులో రైతు భరోసా సాయం జమ చేస్తుండటం సంతోషకరం. ఎకరాకు రూ.6 వేలు పెట్టుబడి సాయం అందజేస్తుండటంతో మా లాంటి చాలా మంది రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. సాగు పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన బాధ తప్పింది.

– మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, మాచన్‌పల్లి, మహబూబ్‌నగర్ రూరల్

అర్హులందరికీ పెట్టుబడి సాయం



జిల్లాలో వానాకాలం సీజన్ పంటల సాగుకు పెట్టుబడి సాయం కింద 2.54 లక్షల మంది రైతులకు రైతు భరోసా డబ్బులు విడుదలయ్యాయి. మొదటి రోజు ఎకరాకు రూ.6 వేల చొప్పున రెండెకరాల లోపు ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. ఇంకా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోని రైతులంతా తమతమ మండలాల వ్యవసాయ అధికారుల వద్ద దరఖాస్తులు చేసుకోవాలి.

– బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర, అధికారులు, రైతులు

రైతు క్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రైతు క్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం మహబూబ్‌నగర్ మండలంలోని ధర్మాపూర్ రైతు వేదికలో కలెక్టర్ విజయేందిర, రైతులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2 లక్షలు మాఫీ చేసి, రైతులను రుణ విముక్తి చేశామని ఆయన గుర్తు చేశారు. రైతులు సంతోషంగా ఉంటే బీఆర్ఎస్ నాయకులకు కడుపు మంటగా ఉందని విమర్శించారు. వరి వేస్తే నాడు ఉరి అన్నారని, కానీ ప్రజా ప్రభుత్వంలో వరి వేస్తే పండుగ అయిందని, సన్న వడ్లు పండించిన రైతులకు బోనస్ ఇచ్చి రైతులను ఆర్థికంగా బలోపేతం చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం రైతును రాజును చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. అనంతరం ధర్మాపూర్ గ్రామానికి చెందిన బుచ్చమ్మ, కృష్ణయ్య, గోవర్ధన్ జీ రైతు కుటుంబం సభ్యులకు రైతు బీమా చెక్కులను కలెక్టర్‌తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారిణి శ్రుతి, ఎంపీడీఓ కరుణశ్రీ, రాజుగౌడ్, ఎస్ బాలయ్య, శ్రీనివాస్ యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఖాజా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

- రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: క్షేత్రస్థాయిలో యువజన కాంగ్రెస్ విభాగాన్ని బలోపేతం చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువజన విభాగాన్ని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేసి యువతను భాగస్వామ్యం చేయాలని కోరారు. మండల, గ్రామస్థాయి కమిటీలను పూర్తి చేయాలన్నారు. యువజన నాయకులు, కార్యకర్తలు ఐవైసీ యాప్‌ను ఉపయోగించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు పోటీ చేయడానికి తగిన ప్రాధాన్యత ఇచ్చేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లా, పట్టణ, మండలం గ్రామస్థాయిలో యువజన విభాగాన్ని పటిష్టం చేస్తామన్నారు. రాష్ట్ర కమిటీ ఇచ్చే కార్యక్రమాలను జిల్లాస్థాయిలో విజయవంతం చేస్తామని తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని మున్సిపల్ జీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ తదితరులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో రాష్ట్ర ఇన్‌చార్జి ఖాలెద్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అరవింద్‌కుమార్ యాదవ్, శివంత్‌రెడ్డి, సంధ్య, మాజిద్, వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్‌యాదవ్, శ్రీనుయాదవ్, మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శులు సంజీవరెడ్డి, ఇంతియాజ్, శివ, ఇమ్రాన్, లక్ష్మణ్‌నాయక్, అసెంబ్లీ అధ్యక్షులు ఎండీ సల్మాన్, లక్ష్మీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జక్కిడి శివచరణ్‌రెడ్డి

న్యూస్‌రీల్

28, 29 తేదీల్లో కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని పసుల కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ బ్రోచర్లను సోమవారం జిల్లాకేంద్రంలో ఎంపీ డీకే అరుణ ఆవిష్కరించారు. కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు తెలంగాణలోని 20 జిల్లాల నుంచి 600కు పైగా విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు అన్ని విధాల సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. రాష్ట్రస్థాయి టోర్నీలో బంగారు పతకం సాధించిన క్రీడాకారులు జాతీయస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజు, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు ఐదోసారి గడువు పొడిగింపు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎల్‌ఆర్‌ఎస్-2020కి సంబంధించి 25 శాతం రాయితీ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. మొదట గత మార్చి 31, ఆ తర్వాత ఏప్రిల్ 30, మూడోసారి మే 3 వరకు, నాలుగోసారి 31 వరకు తిరిగి ఇప్పుడు ఈనెల 30వ తేదీ వరకు ఇలా ఐదుసార్లు పొడిగించారు. దీనికి కారణం దరఖాస్తుదారుల నుంచి సరైన స్పందన రాకపోవడమేనని తెలుస్తోంది.

పూర్తయిన క్షేత్రస్థాయి పరిశీలన

- అధికారికంగా వెల్లడించని అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: షెడ్యూల్ ప్రకారం పాలమూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్ల విభజన ముసాయిదా ప్రక్రియకు సంబంధించి అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన సోమవారంతో పూర్తయింది. కాగా, ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు నగరంలోని ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు మొత్తం 94 వచ్చాయి. ఈనెల 12 నుంచి అధికారులు వీటిని క్షుణ్ణంగా పరిశీలన జరిపి ఒక్కో డివిజన్‌లో కనిష్టంగా 3,000 గరిష్టంగా 3,400 వరకు ఓటర్లు ఉండేలా లెక్కలు గక్కారు. అయితే ఈ డివిజన్లలో చేసిన మార్పులు, చేర్పుల వివరాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంకా వెల్లడించలేదు. వచ్చిన దరఖాస్తులలో ఎన్ని పరిష్కరించారు? ఏమైనా తిరస్కరణకు గురయ్యాయా? లేదా? అనేది గోప్యంగా ఉంచారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసిన వారికి లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాల్సి ఉంది. అలాగే ఈ నివేదికను కలెక్టర్ విజయేందిర బోయికి ఈనెల 17న సమర్పించాల్సి ఉంది.

కోయిల్‌సాగర్‌లో 15.6 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్‌లో సోమవారం సాయంత్రం వరకు నీటిమట్టం 15.6 అడుగులకు చేరింది. జూరాల నుంచి నీటిని ఒక పంపు ద్వారా విడుదల చేస్తుండటంతో ప్రాజెక్టులో నీటిమట్టం ప్రతిరోజు కొంత మేర పెరుగుతోంది. ఈ నెల 6 నుంచి నీటి ప్రవాహం ప్రాజెక్టులోకి రావడం ప్రారంభమైన విషయం తెలిసిందే. యాసంగి పంటలకు వదిలిన తర్వాత 11 అడుగుల మేర ఉన్న నీటిమట్టం ప్రస్తుతం జూరాల నుంచి కృష్ణా జలాల రాకతో 4.6 అడుగుల మేర పెరిగింది. మరో 11 అడుగుల నీరు చేరితే పాత అలుగు స్థాయికి వస్తుంది. గేట్ల లెవల్ నీటిమట్టం 32.6 అడుగులు ఉంది.



మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రిగా వాకిటి శ్రీహరి సోమవారం సచివాలయంలో తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లాకు చెందిన పలువురు నాయకులు మంత్రి కలిశారు.

- దేవరకద్ర

అసమగ్ర ఐటీడీఏ

- సిబ్బంది, నిధులకు నోచుకోని గిరిజనాభివృద్ధి సంస్థ
- ఒకే ఒక్క ఉద్యోగితో కొనసాగుతున్న మన్ననూరు కార్యాలయం
- ఏళ్లతరబడిగా ఇన్‌చార్జ్ పీఓతోనే నెట్టుకొస్తున్న వైనం
- అగమ్యగోచరంగా చెంచులు, గిరిజనుల జీవనం
- నల్లమలలోని అడవి బిడ్డలకు అందని ఆర్థిక ప్రోత్సాహకాలు

చెంచులు, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) నిస్సహాయత చాటుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సంబంధించి మన్ననూరులో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు కనీసం పూర్తిస్థాయి పీఓకు నోచుకోలేకపోతోంది. దీనికితోడు నిధులు కేటాయించక, ఇతర సిబ్బందిని నియమించకపోవడంతో సదరు కార్యాలయం ఒకేఒక్క ఉద్యోగితో నెట్టుకొస్తోంది. ఇన్ని ఆటుపోట్ల మధ్య సాగుతున్న ఐటీడీఏ ఇక చెంచు, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ఏమాత్రం తోడ్పాటునందిస్తుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

– సాక్షి, నాగర్‌కర్నూల్

నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచులు, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన మన్ననూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ నిధులు, సిబ్బంది లేక నామమాత్రంగా తయారైంది. అత్యంత దుర్భర పరిస్థితుల్లో ఉన్న గిరిజన జాతులు (పర్టిక్యులర్లీ వల్నరేబుల్ ట్రైబల్ గ్రూప్స్- పీవీటీజీ), చెంచులు, గిరిజనుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ఏర్పాటైన ఐటీడీఏ ప్రాజెక్ట్‌లో దశాబ్ద కాలంగా రెగ్యులర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (పీఓ) లేకపోవడం ఇక్కడి గిరిజనుల పాలిటశాపంగా మారింది. అత్యంత కీలకమైన పీఓ పోస్టు ఖాళీగా ఉండటం, ఏళ్లుగా ఇన్‌చార్జ్‌తోనే నెట్టుకొస్తుండటంతో ఈ ప్రాజెక్ట్ కింద కార్యకలాపాలు మందగించాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా జిల్లాలో ఇందిరా సౌర జల వికాసం పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద చెంచులకు ఉచితంగా సోలార్ బోర్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఈ కార్యక్రమం పకడ్బందీగా అమలు కావాలన్నా పూర్తిస్థాయి సిబ్బంది నియామకం చేపడితేనే అది సాధ్యమవుతోంది.

గతమెంతో ఘనం..

గతంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ కార్యాలయం మినీ కలెక్టరేట్‌ను తలపించేది. సున్నిపెంట కేంద్రంగా ఉన్నప్పుడు వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కళకళలాడింది. ఐటీడీఏ పీఓతోపాటు గిరిజన, వ్యవసాయ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఉపాధి హామీ, విద్యుత్ తదితర శాఖల అధికారులు కార్యాలయంలో అందుబాటులో ఉండేవారు. చెంచులు, గిరిజనుల ఆర్థికాభివృద్ధి, సాధికారత కోసం ఎకనామిక్ సపోర్ట్ స్కీం అమలు చేసేవారు. కానీ, నాలుగేళ్లుగా ఐటీడీఏ ప్రాజెక్ట్‌కు ఎలాంటి నిధులు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. రెగ్యులర్ పీఓ సహా ఇతర అధికారులు ఎవరూ లేక, సిబ్బంది లేకపోవడంతో చెంచులు, గిరిజనులు సైతం కార్యాలయానికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో నల్లమల లోతట్టు ప్రాంతాల్లోని చెంచులు ప్రభుత్వ పథకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలకు నోచుకోలేకపోతున్నారు. వారి జీవనోపాధికి ఉపకరించే పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అందడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం, ఉపాధి హామీ పనులు, అంగన్‌వాడీ సరుకులపై మాత్రమే చెంచులు ఆధారపడి జీవించాల్సి వస్తోంది. చెంచుల ఉపాధి, జీవనాభివృద్ధి కోసం ఉద్దేశించిన గిరివికాసం, ఈఎస్ఎస్, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అటవీ ఉత్పత్తుల సేకరణ తదితర పథకాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.



నల్లమలలోని మల్లాపూర్‌పెంటలో చెంచుల నివాసం ఉండే బొద్దు గుడిసెలు

పీఎం జన్‌మన్‌కే పరిమితం..

అత్యంత దుర్భర పరిస్థితుల్లో ఉన్న గిరిజనులు (పీవీటీజీ) గ్రూప్‌నకు చెందిన చెంచులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందించేందుకు వీలుగా పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని కేంద్రం చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో పీఎం కిసాన్, ఆయుష్మాన్ భారత్, జాతీయ ఉపాధి హామీ పథకం తదితర పథకాల ప్రయోజనాలను పొందేందుకు అవసరమైన ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, జన్ ధన్ బ్యాంకు ఖాతా వంటి మౌలికమైన పత్రాలను ప్రతి ఒక్క చెంచు వ్యక్తికి అందించాల్సి ఉంటుంది. దీనికోసం ప్రత్యేకంగా శిబిరాలను నిర్వహించి అవసరమైన పత్రాలను అధికారులు అందజేస్తారు. ఈ కార్యక్రమం మినహా గిరిజనుల కోసం ఉద్దేశించిన ఇతర ఏ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదు.

ఏళ్లుగా ఒక్కరే దిక్కు..

ఉమ్మడి రాష్ట్రంలో ఐటీడీఏ సున్నిపెంట (శ్రీశైలం) పరిధిలో కార్యకలాపాలు కొనసాగగా.. 2014లో రాష్ట్ర విభజన అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లాలోని మన్ననూర్‌లో ఐటీడీఏ ప్రాజెక్ట్ ఏర్పాటైంది. అయితే గడిచిన 11 ఏళ్లుగా ప్రభుత్వం రెగ్యులర్ పీఓను మాత్రం నియమించలేదు. ప్రాజెక్ట్ అధికారిగా ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించాల్సి ఉండగా, ఇన్నేళ్లుగా తాత్కాలికంగా, జిల్లాస్థాయి అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నెట్టుకొస్తోంది. పీఓతోపాటు కార్యాలయంలో వివిధ విభాగాలకు అధికారులు, కార్యాలయ నిర్వహణకు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు తదితర పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా, కేవలం సీనియర్ అసిస్టెంట్ స్థాయిలో ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారు. మిగతా ఏ ఒక్క అధికారి కూడా లేకపోవడంతో ఐటీడీఏ ప్రాజెక్ట్ నామమాత్రంగా మారింది.



మన్ననూరు ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి జిల్లాలు 3 (మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ)	చెంచులు ఉండే మండలాలు 25	చెంచు పెంటల సంఖ్య 150
		చెంచుల జనాభా (సుమారు) 18,000

ప్రభుత్వానికి ప్రతిపాదించాం..

మన్ననూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ రెగ్యులర్ పీఓ, ఇతర సిబ్బంది నియామకం కోసం ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం పీఎం జన్‌మన్ కింద చెంచుల్లోని ప్రతి ఒక్కరికి అవసరమైన పత్రాలను అందించేందుకు కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం. మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా వైద్యసేవలు ప్రారంభించాం.

– రోహిత్ గోపిడి, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, మన్ననూర్

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- ఫస్టియర్‌లో 63.37 శాతం, సెకండియర్‌లో 49.88శాతం ఉత్తీర్ణత



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మొదటి సంవత్సరం జనరల్ కోర్సుల్లో 5,315 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైతే 63.37 శాతంతో 3368 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 2,690 మంది బాలురు పరీక్షలు రాయగా 56.1శాతంతో 1,509 మంది, 2,625 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా 70.82 శాతంతో 1,859 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరంలో 509 మంది విద్యార్థులు హాజరైతే 343 మంది ఉత్తీర్ణులై 67.39 శాతం నమోదు చేశారు. ఇందులో 343 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా.. 67.64 శాతంతో 232 మంది, బాలికలు 166 మంది హాజరు కాగా.. 66.87 శాతంతో 111 మంది ఉత్తీర్ణత సాధించారు.

■ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్ కోర్సుల్లో మొత్తం 2,944 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 49.88శాతంతో 1,469 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 1,811 మంది పరీక్షలకు హాజరైతే 47.73 శాతంతో 865 మంది, బాలికలు 1,133 మంది హాజరైతే 53.31 శాతంతో 604 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి సెకండియర్‌లో రీకౌంటింగ్, రీ వ్యాలువేషన్‌కు ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం అవకాశం కల్పించింది.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర

- ప్రజావాణికి 112 ఫిర్యాదులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 112 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

■ జూన్ 16 నుంచి జూలై 31 వరకు 45 రోజుల పాటు అతిసార వ్యాధి నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ 0–5 ఏళ్ల పిల్లలలో అతిసార ప్రబలకుండా నివారణలో భాగంగా పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల ద్వారా ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ పాకెట్లు, జింక్ టాబ్లెట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ అతిసార వల్ల దేశంలో 4.8 శాతం పిల్లలు చనిపోతున్నారని తెలిపారు. సోమవారం నుంచి జూలై 31వ తేదీ వరకు ఇంటింటికి ఓఆర్ఎస్ పాకెట్లు, జింక్ టాబ్లెట్ల పంపిణీతో పాటు.. వీటి వినియోగించడంపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారులు సిబ్బంది ఈ విషయంలో సరియైన సూచనలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒక ఓఆర్ఎస్ పాకెట్‌ను లీటర్ నీటిలో కలుపుకొని నీళ్ల విరేచనాలున్న పిల్లలకు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డా.భాస్కర్‌నాయక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పద్మజ, జిల్లా మాస్ మీడియా అధికారి మంజుల తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

న్యాయవాద రక్షణ చట్టం అమల్లోకి తీసుకురావాలి

- వివరాలు 9లో..

క్లుప్తంగా

కేఎల్ఐ కాల్వలో పడి వ్యక్తి మృతి



కేఎల్ఐ కాల్వలో లోకేష్ మృతదేహం

మిడ్జిల్: మండల కేంద్రంలోని కొత్తూర్ రోడ్డు సమీపంలో కేఎల్ఐ కాల్వలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మిడ్జిల్‌కు చెందిన వస్పరి లోకేష్(నాగయ్య) (34) ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్లాడు. రాత్రి గ్రామంలోని బంధువుల ఇంటి దగ్గర భోజనం చేశాడు, ఇంటికి వెళ్లలేదు, తరచు అతనికి మూర్ఛవ్యాధి వస్తూ ఉండేది. సోమవారం ఉదయం కొత్తూర్ రోడ్డు సమీపంలోని కేఎల్ఐ కాల్వ బ్రిడ్జి కింద వ్యక్తి పడి ఉండడం చూసి గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి వెళ్లిన పోలీసులు లోకేష్ మృతదేహంగా గుర్తించారు. మూర్ఛవ్యాధితో ప్రమాద వశాత్తు కాల్వలో బ్రిడ్జిపై నుంచి పడి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్లకు తరలించినట్లు ఎస్ఐ శివ నాగేశ్వర్‌నాయుడు తెలిపారు. లోకేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

కేటీదొడ్డి: అనుమానాస్పదంగా వివాహిత మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కేటీదొడ్డి మండలంలోని పాతపాలెం గ్రామానికి చెందిన సగడం అనిత(26) తెల్లవారు జామున ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి సీఐ టంగుటూరి శ్రీను, ఎస్ఐ శ్రీనివాసులు వెళ్లి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఆమె మృతిపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఆమె బంధువులతో మనస్పర్థలు ఉన్నాయని, ఆమె గొంతుపై గాట్లు ఉన్నాయని పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాసులు వివరణ కోరగా, ఆమె తమ్ముడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నర్వ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అంకెన్‌పల్లికి చెందిన లక్ష్మన్న (54) తన కుమార్తెను చూసేందుకు సోమవారం సాయంత్రం గుడిగండ్లకు బయలుదేరాడు. రాత్రి 8 గంటల సమయంలో పాతర్చేడ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హన్వాడ: మండలంలోని నాగినోనిపల్లి శివారులో ఈ నెల 13న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని సల్లోనిపల్లికి చెందిన సిరంజి నర్సిములు (45) 13వ తేదీ రాత్రి మహమ్మదాబాద్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో నాగినోనిపల్లికి చేరుకోగానే హన్వాడ నుంచి కోస్గి వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొనడంతో నర్సిములుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని.. తమ్ముడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ వివరించారు.

అందరిపై జగద్గురువుల ఆశీస్సులు



మహోత్సవాల వేదికపై జగద్గురువులు

- ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- పాలమూరులో వైభవంగా పంచాచార్య యుగమానోత్సవం, బసవేశ్వర జయంత్యుత్సవం
- హాజరైన జగద్గురువులు – వేలాదిగా పాల్గొన్న ప్రజలు

స్టేషన్ మహబూబ్‌నగర్: మనందరిపై జగద్గురువుల దివ్య ఆశీస్సులు ఉండాలని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. పాలమూరు పట్టణానికి సమీపంలోని శ్రీవాసవీ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన యుగమానోత్సవం, బసవేశ్వర జయంత్యుత్సవాల్లో ఎంపీ డీకే అరుణ పాల్గొని మాట్లాడుతూ.. బసవేశ్వరుడు విప్లవవాది అని, సమసమాజ స్థాపనకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. అందరూ సమానమేనని, అందరిని సమాన దృష్టితో చూడాలని ఆయన తెలియజేసినట్లు చెప్పారు. ఆయన స్ఫూర్తితో సమాజంలో కులమతాలు బేధాలు లేకుండా సమానత్వంతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాశీ, ఉజ్జయిని ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ప్రొఫెసర్ చంద్రశేఖర్‌రెడ్డి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముందుగా చిన్నారులు, యువతుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ భక్తిపాటలకు భరతనాట్యం, కూచిపూడి నాట్యం చేసి అలరించారు.



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

హాజరైన జగద్గురువులు

మహోత్సవాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి జగద్గురువులు, స్వామిజీలు హాజరయ్యారు. ఉజ్జయిని సద్ధర్మ సింహాసనాధీశ్వర శ్రీ10008 జగద్గురు శ్రీసిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్య, శ్రీశైల సూర్యసింహాసనాధీశ్వర శ్రీ1008 జగద్గురు శ్రీడాక్టర్ చన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య, కాశీ జ్ఞానసింహాసనాధీశ్వర 1008 జగద్గురు శ్రీడాక్టర్ చంద్రశేఖర శివాచార్య, డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్యులు పాల్గొన్నారు. అనంతరం స్వామిజీలు భక్తిప్రవచనాలు చేశారు. ఉదయం ఇష్టలింగ పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్.రవికుమార్, ముక్తా శ్రీశైలం, రాజశేఖరస్వామి, సిద్ధిరామప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బసవేశ్వర జయంత్యుత్సవాలకు హాజరైన ప్రజలు

ఆడిపాడిన కలెక్టర్



పరిపాలనా వ్యవహారాల్లో బిజీగా గడపాల్సిన కలెక్టర్ బదావత్ సంతోష్ మెడికల్ విద్యార్థులతో కలిసి ఆడిపాడారు. సోమవారం నాగర్‌కర్నూల్ శివారులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించిన ట్రెడిషనల్ డే వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లంబాడా వేషధారణ విద్యార్థులతో కలిసి కలెక్టర్ నృత్యం చేసి ఉత్తేజపరిచారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ భారతీయ కళలు, సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను రాబోయే తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘు, డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి, వైద్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – నాగర్‌కర్నూల్ క్రైం

నేటి మహా ధర్నాను జయప్రదం చేయండి

మన్ననూర్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మంగళవారం శాంతిచర్చల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పౌరహక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జక్కా బాలయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను 2024 నుంచి ఇప్పటి వరకు 540 మందిని కాల్చి చంపారని.. వీరిలో మూడోవంతు అమాయకులైన ఆదివాసి బిడ్డలే ఉన్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా సభ్యుడు బియ్యని వెంకటేష్, కుల నిర్మూలన పోరాట సమితి నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ ముద్దునూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జక్కా బాలయ్య

జూరాలకు జలకళ



పూర్తిస్థాయి నీటిమట్టంతో జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్

- ఎగువన కురిసిన వర్షాలకు పెరిగిన ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టులోకి 50వేల క్యూసెక్కుల వరద
- దిగువకు 25,835 క్యూసెక్కులు విడుదల

ధరూరు/ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువన కురిసిన వర్షాలతో పైనుంచి ఇన్‌ఫ్లో పెరిగిందని.. 50వేల క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు 21వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం రాత్రి 7:30 గంటల వరకు 50వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 23, 957 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 1,500 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 63 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 25,835 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.184 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

■ జూరాల ప్రాజెక్టుకు దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఈమేరకు సోమవారం 8 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపడుతునట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 4 యూనిట్ల ద్వారా 156 మెగావాట్లు, 25.144 ఎంయూ, దిగువలో 4 యూనిట్ల ద్వారా 160 మెగావాట్లు, 27.700 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 52.844 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

శ్రీశైలంకు 28,302 క్యూసెక్కుల ప్రవాహం

దోమలపెంట: జూరాలలో సోమవారం విద్యుదుత్పత్తి చేస్తూ 23,957 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 4,345 మొత్తం 28,302 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. ప్రస్తుతం శ్రీశైలంలో నీటి మట్టం 842.4 అడుగుల వద్ద 65.4574 టీఎంసీల నీటినిల్వ ఉంది. 24గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

మిగిలిన పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలి



డీఎస్ఈ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం అందిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవలి హెచ్ఎంలుగా పదోన్నతులు ఇచ్చిన తర్వాత మిగిలిన పోస్టులు, రిటైర్డ్ అయ్యాక ఖాళీ అయిన పోస్టులకు ప్రమోషన్‌లు ఇవ్వాలని కోరుతూ టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్‌ను హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. ఈమేరకు ఇటీవల నియమితులైన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో బడులు సమర్థవంతంగా నిర్వహించేందుకు జోన్ -2లో ఖాళీగా ఉన్న 750 పోస్టులను వెంటనే భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీటితో పాటు పండిట్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయగా మిగిలిన 507 పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పాజ్ ఫోరం అధ్యక్షులు వివేక్, టీపీఆర్టీయూ నాయకులు శ్రవణ్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

పట్నం వెళ్దామని.. ఆత్మకూర్‌లో దింపాడు

- అరగంటలో వస్తానని మూడు రోజులుగా ఫోన్ స్విచ్ ఆఫ్
- కన్నతల్లిని బస్టాండ్‌లో వదిలేసిన కసాయి కొడుకు
- కాళ్లకు గాయాలతో వృద్ధురాలి కన్నీరుమున్నీరు
- బంధువులైనా తీసుకెళ్లాలని వేడుకోలు



ఆత్మకూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో పార్వతమ్మ

ఆత్మకూర్: మనిషన్నవాడు మాయమైపోతున్నాడు.. నవమాసాలు మోసి కనీ పెంచి ప్రయోజకుడిని చేసిన కన్నతల్లిని బస్టాండ్‌లో వదిలేశాడో కసాయి కొడుకు.. ఈ హృదయ విదారక ఘటన ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా.. వనపర్తి జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టకాలనీలో నివాసముంటున్న పార్వతమ్మను(60) కుమారుడు భాస్కర్ హైదరాబాద్‌కు తీసుకెళ్తానని మూడురోజుల క్రితం ఆర్టీసీ బస్సులో తీసుకొచ్చాడు. ఆత్మకూర్ బస్టాండ్‌లో దించి ఇక్కడే కూర్చోమని.. అరగంటలో వస్తానని చెప్పి పత్తా లేకుండా ఉడాయించాడు. తీర ఎంతరాత్రయినా రాకపోవడంతో తోటి ప్రయాణికుల సహాయంతో కుమారుడికి ఫోన్ చేయగా.. పొద్దున్నే వాస్తానని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. మూడురోజులుగా కనిపించిన ప్రతి ప్రయాణికుడిని తనవద్ద ఉన్న కాగితం ముక్క చూయిస్తూ తన కుమారుడికి ఫోన్ చేయాలని కోరుతూ.. ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండడంతో కన్నీరు మున్నీరు అవుతుంది. పార్వతమ్మ కాళ్లకు గాయం కావడంతో బస్సు ఎక్కలేక, ఎక్కడికి వెళ్లలేక కంటతడి పెడుతూ బస్టాండ్‌లోనే బిక్కుబిక్కుమంటూ మూడు రోజులుగా కుమారుడి కోసం ఎదురుచూస్తోంది. వనపర్తిలోని తమ బంధువులు స్పందించి తనను ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని వేడుకుంటుంది.

ట్రాక్టర్‌పై స్టంట్స్..జరిమానా విధింపు

మానవపాడు: జాతీయ రహదారిపై స్టంట్స్ చేస్తూ ట్రాక్టర్‌ను నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసి జరిమానా విధించిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపినా వివరాలు.. ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామానికి చెందిన రామకృష్ణ మానవపాడు నుంచి ఉండవెల్లి మీదుగా జాతీయ రహదారిపై రెండు రోజుల క్రితం ట్రాక్టర్‌పై విన్యాసాలు చేస్తుండగా మానవపాడు పోలీసులు అదుపులోకి తీసుకొని మోటార్ వైకిల్ యాక్ట్ ప్రకారం రూ.1100 జరిమానా విధి ంచినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.



విద్యుత్ తీగలు చోరీ

మానవపాడు: మండలంలోని గోకులపాడు, చెన్నిపాడు గ్రామాల సరిహద్దులోని పొలాల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. వ్యవసాయ పొలాల్లో మోటర్లు, విద్యుత్ వైర్లు, ఫీజులు, పైపుల చోరీకి పాల్పడుతున్నట్లు ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. గోకులపాడుకు చెందిన రైతులు చిన్న నరసింహులు, జమ్మన్న, పలువురి పొలాల్లో చెందిన పొలాల్లో సుమారు రూ.70 వేలు విలువైన విద్యుత్ వైర్లు చోరీ జరిగినట్లు సోమవారం పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై గాల్లోకి ఎగిరిన కారు

జడ్చర్ల: జడ్చర్ల శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం కారు అతి వేగంతో గాల్లోకి ఎగిరి ఓ చెట్టుపై పడిన సంఘటన చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వస్తున్న కారు కావేరమ్మపేట వద్దకు వచ్చే సరికి ఒక్కసారిగా కారు గాలిలోకి దాదాపు పది అడుగుల పైకి ఎగిరి రహదారిపై ఉన్న ఓ చెట్టు కొమ్మలపై పడింది. కొమ్మలు విరిగి కిందకు పడిన కారులో ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన డ్రైవర్ రామయ్య స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. హైదరాబాద్ నుంచి కర్ణాటకకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. రహదారి పక్కన దాబా నుంచి ఓ కారు అకస్మత్తుగా జాతీయ రహదారిపై అడ్డు రావడంతో బ్రేక్ వేయబోయి ఎక్సలేటర్ తొక్కడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని డ్రైవర్ పేర్కొన్నట్లు సమాచారం. ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతిన్నది.

వేర్వేరు కేసుల్లో ముగ్గురికి జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మూడు వేర్వేరు కేసుల్లో ముగ్గురు నేరస్తులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తులు సోమవారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళ్తే..

■ నవాబ్‌పేట మండలం కామారం గ్రామానికి చెందిన కృష్ణయ్య అసభ్య చిత్రాల ప్రదర్శన, దౌర్జన్యం ఇతర నేరాల కిందట 2024లో టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదు కాగా పోలీసులు కోర్టులో ఛార్జిషిట్ దాఖలు చేశారు. సోమవారం కేసు విచారణకు రావడంతో ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయమూర్తి కృష్ణయ్యకు 8 నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

■ మహిళను లైంగికంగా వేధించడం, దాడి, దూషణతో గండీడ్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గొల్ల కృష్ణయ్యపై 2022లో మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయగా.. సోమవారం కేసును విచారణ చేసిన ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయమూర్తి గొల్ల కృష్ణయ్యకు మూడేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

■ మిడ్జిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020లో సెక్షన్ 354 కింద నమోదైన కేసులో నేరస్తుడు కర్నెకోట నిరంజన్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సోమవారం న్యాయమూర్తి తీర్పునిచ్చారు. శిక్ష పడిన నేరస్తులను జిల్లా జైలుకు తరలించారు. నేరస్తులకు శిక్షలు పడేందుకు కృషి చేసిన కోర్టు పోలీస్ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కేస్ డైరీ ఆఫీసర్లను ఈ సందర్భంగా ఎస్పీ డి.జానకి అభినందించారు.

పశువుల పాక దగ్ధం : ఆవు సజీవ దహనం

కోస్గి రూరల్: పశువుల పాక దగ్ధమై ఓ ఆవు సజీవ దహనం కాగా.. మరిన్ని పశువులకు మంటలు అంటుకొని గాయాలైన ఘటన సోమవారం కొత్తపల్లి అనుబంధ గ్రామం లోదీపూర్‌లో చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. గ్రామానికి చెందిన వల్పాలి హన్మంతు ఎప్పటిలాగే తన వ్యవసాయ పొలంలోని పశువుల పాకలో ఆదివారం రాత్రి పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి చూడగా అప్పటికే పాక దగ్ధమై అవు మృతి చెందగా.. మరిన్ని పశువులకు నిప్పంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు పాకకు నిప్పటించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

పోక్సో కేసులో యువకుడి రిమాండ్

గద్వాల క్రైం: పోక్సో కేసులో యువకుడుని రిమాండ్‌కు తరలించినట్లు గద్వాల సీఐ శ్రీను తెలిపారు. జిల్లాకు చెందిన ఓ బాలికతో అసభ్యంగా వ్యవహరించినట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి సోమవారం జీ వెంకటేశ్‌ను గద్వాల జిల్లా పోక్సో కోర్టులో జడ్జి ఎదుట హాజరుపర్చగా 14రోజులపాటు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. బాలికలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన, వేధింపులకు గురిచేసిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిందితుడిని మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించామని సీఐ పేర్కొన్నారు.

విత్తన నాణ్యతోనే పంట దిగుబడి

పాడి-పంట

జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

- మంచి గింజలను ఎంపిక చేసుకోవాలి
- 90 శాతం విత్తనాలు మంచిగా ఉండాలి

అలంపూర్: విత్తనం బాగుంటే మొలక బాగా వస్తుంది. మొలకలు బాగా వస్తే మొక్కలు బాగా పెరుగుతాయి. అందుకే విత్తు కోసం నాణ్యమైన గింజలను ఎంపిక చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ రైతులకు సూచించారు. నాణ్యమైన విత్తనాలను క్రమ పద్ధతిలో కడితే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని వివరించారు. విత్తనాలను మొలక కట్టి నాణ్యత ప్రమాణాలను బట్టి ఎంపిక చేసుకోవచ్చు. విత్తనాలను లెక్కించే విధానాల గురించి రైతులకు ఈ విధంగా వివరించారు.

విత్తన ఎంపిక :

పంట సాగులో విత్తనం ప్రభావం నుంచి విత్తనాన్ని నాటితే ఉత్తమ ఫలితాలను అందుకోవచ్చు. – అనుకూలమైన, ఆరోగ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకుంటే రైతులకు అన్ని విధాల శ్రేయస్కరం. విత్తన నాణ్యత ప్రమాణాలను మొలక శాతం ఆధారంగా నిర్ధారిస్తారు. అందుకు తెలుగు రాష్ట్రాల్లో విత్తన పరీక్షా కేంద్రాలున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ రాజేంద్రనగర్, ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లి గూడెం, ఎమ్మిగనూరులో విత్తన పరీక్షా కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి విత్తనాలను ఎంపిక చేస్తారు. ఆ విత్తనాలను ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు రైతులకు సరఫరా చేస్తారు. రైతులు పండించిన పంట నుంచి కూడా విత్తనాలు తయారు చేసుకోవచ్చు. విత్తనాలను మొలక కట్టి వాటి నాణ్యత ప్రమాణాలను బట్టి ఎంపిక చేసుకోవచ్చు. రైతులు నాలుగు పద్ధతుల్లో తెలుసుకోవచ్చు. రైతు స్థాయిలో విత్తన మొలక శాతాన్ని తెలుసుకోనే పద్ధతులు ఉన్నాయి.



పేపర్ టవల్ ద్వారా మొలక శాతం పరీక్ష

పేపర్ టవల్ పద్ధతి : పేపర్ టవల్ లేదా మందపాటి బట్టను తీసుకొని బాగా తడిపి గచ్చు నేలపై పరిచి 100 గింజలను వరుసలో అమర్చాలి. దీనిపై మరో తడి పేపర్ టవల్‌ను పరచి రెండింటిని కలిపి చాపలా చుట్టాలి. చివర్లో దారంతో చుట్టి ఏదైనా పాత్రలో ఏటవాలుగా పెట్టాలి. అప్పుడప్పుడు నీటితో తడుపుతు ఉండాలి. ఈ పద్ధతి ద్వారా వరి, జొన్న, పొద్దుతిరుగుడు విత్తనాలను పరీక్షించుకోవచ్చు.



ట్రే పద్ధతిలో మొలక శాతం పరీక్ష

ట్రే పద్ధతి : లావు గింజ రకాలైన పత్తి, వేరుశనగ, ఆముదం వంటి విత్తనాలను ఇసుక పోసిన ప్లాస్టిక్ ట్రేలో వేయాలి. 100 విత్తనాలను అంగుళం లోతు ఇసుకలో విత్తుకోవాలి. తేమ ఉండేటట్లు నీళ్లు చల్లుతు ఉండాలి.

పెట్రి డిష్ పద్ధతి : వంగ, టమాట, మిరప వంటి చిన్న విత్తనం మొలకలను పరీక్షించుకోవచ్చు. పెట్రి డిష్‌లో బ్లాటింగ్ పేపరును అమర్చి నీటితో తడపాలి.

గుడ్డమూట పద్ధతి : మొలక కట్టాల్సిన 100 విత్తనాలను గుడ్డలో మూతకట్టి దీనిని చిన్న ప్లేటులో పెట్టి అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. ఈ పద్ధతి ద్వారా 5 నుంచి 10 రోజుల్లో మొలక శాతాన్ని తెలుసుకోవచ్చు.

మొలక శాతం : ■ సామాన్యంగా పరీక్షకు తీసిన శాంపిల్ గింజల్లో నూటికి 99 శాతం మంచి గింజలు ఉండాలి.

■ మొక్కజొన్నకు 90 శాతం మొలకలు రావాలి.

■ ఇతర ధాన్యాలకు 75నుంచి 80శాతం మొలకలు రావాలి.

■ పప్పుదినుసులకు 75నుంచి 80శాతం మొలకలు రావాలి.

■ నునెగింజలకు 70నుంచి 80శాతం మొలకలు రావాలి.

■ పత్తి, బెండ విత్తనాలకు 65 శాతం రావాలి.

ఉపయోగాలు

■ రైతులు పైన పేర్కొన్న నాలుగు పద్ధతుల్లో తమ స్థాయిలో మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి.

■ మొలక శాతం పరీక్షల అనంతరం పంట పెంచుకోవడం వలన వృథా సమయం కాదు.

■ ఎంచుకున్న విత్తనాలు సరైనవా.. కాదా..? అనే విషయం గుర్తించవచ్చు.

■ విత్తనాల విషయంలో ఆర్థికంగా నష్టపోకుండా జాగ్రత్త పడవచ్చు.

■ నాణ్యమైన విత్తనాలను నాటితే అధిక దిగుబడులు పొందవచ్చు.

సర్వర్ బిజీ!

- రిజిస్ట్రేషన్ శాఖలో స్తంభించిన కార్యకలాపాలు

మెట్టుగడ్డ: రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆఫీస్ లాగిన్ సర్వర్ మొరాయించడంతో కార్యాలయాల్లో కార్యాకలాపాలు స్తంభించి దస్తావేజుల ప్రక్రియకు తీవ్ర అంతరాయం కలిగింది. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి అన్ని సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ (సర్వర్) సమస్య తలెత్తడంతో మధ్యాహ్నం వరకు రిజిస్ట్రేషన్లు నిలిచాయి. సర్వర్ పనిచేయక కార్యాలయ సిబ్బంది ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది. అమ్మకపు, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం తర్వాత సర్వర్ సమస్య తీరడంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది. ఈ విషయంపై మహబూబ్ నగర్ సబ్‌రిజిస్ట్రార్ మొహమ్మద్ హమీద్‌ను వివరణ కోరగా రాష్ట్రవ్యాప్తంగా సాంకేతిక సేవల్లో సమస్య వచ్చిందన్నారు.



వెలవెలబోతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం